క్లుప్తంగా

మెజిస్ట్రేట్‌ను నియమించండి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం జ్యుడీషియల్ కోర్టుకి రెగ్యులర్ మెజిస్ట్రేట్‌ను నియమించాలని జిల్లా జడ్జి వసంతపాటిల్‌ను భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. రెగ్యులర్ మెజిస్ట్రేట్ నియామకం అయ్యే వరకు ఇన్‌చార్జ్ మెజిస్ట్రేట్ గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లుని వారంలో మూడు రోజులు భద్రాచలం కోర్టులో విధులు నిర్వహించే విధంగా చూడాలని కోరారు. జిల్లా జడ్జి స్పందించినట్లు భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం తెలిపారు. కార్యక్రమంలో పసుపులేటి రాంబాబు, పాకల మోహన్ కృష్ణ, రామకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి మంగళవారం పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతుల సమస్యలు ఫోన్ ద్వారా ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు సర్పంచ్ తెలియజేశారు. ఎమ్మెల్యే సూచనలతో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తక్షణమే లారీలు పంపిస్తామని, వీలైతే రైతులు కూడా తమ ట్రాక్టర్ల ద్వారా సంబంధిత మిల్లులకు ధాన్యం రవాణా చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధీర్, రైతులు పాటి మన్మథరెడ్డి, జెట్టి సాంబశివరావు, పాటి వెంకటరెడ్డి, పసునూరి రాములు, యాదగిరిరెడ్డి, శంకరయ్య, సంఘం, సీఈఓ, సిబ్బంది పాల్గొన్నారు.

వీఓఏల నిరసన

భద్రాచలంఅర్బన్: ఐకేపీ వీవోఏల సమ్మె విషయంలో అధికారుల వేధింపులు, ప్రభుత్వ అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం సంఘం పట్టణ కోకన్వీనర్ మర్ల పాటి రేణుక అధ్యక్షతన జరిగిన సభలో కార్యదర్శి ఏజే.రమేష్ మాట్లాడుతూ.. సమ్మె పరిష్కారంపై దృష్టి పెట్టకుండా అణచివేయాలని చూస్తే రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పట్టణ కన్వీనర్ యంబీ నర్సారెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు నకిరుకంటి నాగరాజు, లక్ష్మీకాంత్, అప్పారీ రాము, వేల్పూరి రాము, బాలకృష్ణ, బాలాజీ, వాసు, నాయకులు అజయ్, మురళి కృష్ణ, చంద్రలీల, సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: లక్ష్మీనగరం ప్రధాన రహదారిపై వీఓఏలు మానవహారంగా నిలబడి నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి జీలకర్ర పద్మ మాట్లాడుతూ.. వీఓఏల పట్ల రాష్ట్రప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలి అని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు నాగరాజు, శ్యాం, రమేష్, రమాదేవి, కమల, పాపమ్మ, భద్రమ్మ,దుర్గారాణి, లత, అరుణ, కృష్ణకుమారి, వెంకటరమణ, ఝాన్సీ, రాజేశ్వరి, సీఐటీయూ మండల అధ్యక్షుడు కొర్స చిలకమ్మ పాల్గొన్నారు.

కరకగూడెం: వీఓఏల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకుడు కొమరం కాంతారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం వీఓఏల సమ్మెకు మద్దతు తెలుపుతూ నిరసన ర్యాలీని నిర్వహించారు. స్థానిక ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వీఓఏలు రమాదేవి, వెంకన్న, సారక్క, పద్మ, ముత్తయ్య, నరసింహారావు, వెంకటమ్మ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ

భద్రాచలంటౌన్: స్థానిక సరోజమ్మ వృద్ధాశ్రమానికి పట్టణానికి చెందిన ఏకుల రామచంద్రరావు, వీర మంగతాయారు 50వ పెళ్లిరోజు సందర్భంగా రూ.15వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను మంగళవారం వితరణగా అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆశ్రమంలో కేక్‌కట్ చేశారు. శేషగిరిబాబు, వెంకటేష్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు కృషి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ సంరక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేసేది ఐఎన్‌టీయూసీనేనని ఆ సంఘం జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ అన్నారు. మంగళవారం పీకే ఓసీలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థను ప్రైవేట్ పరం కాకుండా కాపాడేది కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీనేనని అన్నారు. ఏరియా నుంచి ఫిట్టర్ కార్మికుల బదిలీలను యాజమాన్యం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్, నాయకులు రాజలింగం, పెదనాగయ్య,శ్రీను, కరుణాకర్ పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తి చేయాలి

అశ్వారావుపేటరూరల్: నిరుపేదలకు డబుల్ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ఇవ్వాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి దొర డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మామిళ్ల వారిగూడెం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ ఇళ్లను ఆయన మంగళవారం పరిశీలించి, గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక చోట్ల ఇళ్ల నిర్మాణాలు పునాది దశలోనే మూలుగుతున్నాయని ఆరోపించారు. నార్లపాటి శ్రీనివాసరావు, అంకోలు వెంకటేశ్వరరావు, ఉప్పల బ్రహ్మేంద్ర, నాగేంద్ర, తగరం మహేష్, సిద్దుల నాగేశ్వరరావు ఉన్నారు.

అధునాతన పోలీసింగ్..

- తనిఖీల్లో పాపిలాన్ ఫింగర్ ప్రింట్ యంత్రం వినియోగం
- పాత నేరస్తుల గుర్తింపునకు ఉపయోగకరం
- నేరాల తగ్గుదలకు అవకాశం



భద్రాచలం పట్టణంలో ఫింగర్ ప్రింట్ ద్వారా తనిఖీ చేస్తున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలంలో శాంతి, భద్రతల పరిరక్షణకు పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో టౌన్ పోలీసులు ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలంలో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులు, పాత నేరస్తుల కదలికలు, ప్రస్తుతం వారు చేసే పనులు తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. ఈ మేరకు పాలిపాల్ ఫ్రింగర్ ప్రింట్స్‌తో పట్టణంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. దీనివల్ల గత నేరస్తుల్లో మళ్లీ నేరాలు చేస్తే దొరికిపోతారు. విషయం తెలిసిన నేర ప్రవృత్తిదారులు నేరాలు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో ఏజెన్సీలో నేరాల శాతం తగ్గుముఖం పడుతుంది.

పాపిలాన్ ఫ్రింగర్ ప్రింట్..

మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల నియంత్రణకు, నేర పరిశోధనకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులు అవలంబిస్తున్నారు. అందులో భాగంగా ఒక్క వేలి ముద్రతో నేరస్తుల చిట్టా బయటపడుతోంది. రాష్ట్రంలో (ఎస్‌ఈఆర్బీ) స్టేట్ క్రైమ్ రికార్డ్ బ్యూరోలో నమోదైన నేరస్తుల జాబితాను ఫింగర్ ప్రింట్ పరికరంలో నిక్షిప్తం అయి ఉంటుంది. పూర్తి వివరాలను వారి ఆధార్ కార్డు, వేలి ముద్రలతో ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు. ఒక్కసారి పోలీస్ స్టేషన్‌లో నిందితులుగా పేరు నమోదు అయితే వారి సమాచారం మొత్తం పేరు, వయస్సు, నివాసం, ఏ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది, ఏ విషయంలో కేసు నమోదైంది తదితర పూర్తి వివరాలు పాపిలాన్ ఫింగర్ పరికరంలో నిక్షిప్తం అయ్యి ఉంటుంది. పోలీసులకు అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల ఫింగర్ ప్రింట్‌ను పరికరంపై ఉంచితే గతంలో నేరస్తుడా.. కాదా.. అనేది నిర్ధారణ అవుతుంది.

ప్రతిరోజూ 20– 25 వేలి ముద్రల సేకరణ

భద్రాచలంలో మొత్తం 2 పాపిలాన్ ఫింగర్ ప్రింట్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా పోలీసులు ప్రతిరోజూ సగటున 20–25 మంది వరకు అనుమానాస్పద వ్యక్తుల వేలి ముద్రలను సేకరించారు. మార్కెట్లు, షాపింగ్ మాల్స్, థియేటర్లతో పాటు సభలు, సమావేశాల్లో వీటిని వినియోగిస్తున్నారు. అంతేగాకుండా రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన భద్రతను అందించేందుకు అనుమానాస్పద వ్యక్తులు, పాత నేరస్తులు కనబడితే వారిని సులువుగా గుర్తు పట్టి దొంగతనాలు, ఇతర ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తం అవుతున్నారు.

22 మంది నేరస్తులు ట్రేస్..

భద్రాచలం పట్టణ పరిధిలో గతించిన ఐదు నెలల్లో 3,601 మంది అనుమానాస్పద వ్యక్తుల వేలి ముద్రలను పోలీసులు సేకరించారు. 22 పాత నేరస్తులు పట్టుబడ్డారు. వీరిని విచారించి ఎందుకోసం వచ్చారు..? ప్రస్తుతం ఏ పనులు చేస్తున్నారు..? అని ఆరా తీశారు. అంతేగాకుండా ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండాలని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సత్ప్రవర్తనతో మెలగాలని సూచిస్తున్నారు.

నేరాలు తగ్గించేందుకే..



ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలంలో నేరాలను పూర్తిగా తగ్గించి, మెరుగైన శాంతి భద్రతల రక్షణకు కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే విచారించకుండా ఫింగర్ ప్రింట్ ద్వారా వారి నేర చరిత్రను తెలుసుకుని విచారిస్తున్నాం. ఇలాంటి తనిఖీలతో నేరస్తుల్లో భయం, ఆందోళన మొదలై నేరాలు తగ్గే ఆస్కారం ఉంటుంది. అంతేగాకుండ ప్రజలకు పోలీసులపై పూర్తి నమ్మకం కలుగుతుంది. ప్రజలు కూడా పోలీసులకు పూర్తి సహకారం అందించి నేరాల నియంత్రణకు సహకరించాలి.

– పరితోష్ పంకజ్, ఏఎస్పీ, భద్రాచలం

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ

చర్ల: తెలంగాణా రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో కొనసాగుతున్న జనరంజక పాలన, అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ సూచించారు. మండల కేంద్రం చర్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజారంజక పాలనను చూసి ఓర్వలేక విపక్షాలు బీఆర్ఎస్‌పై బురద జల్లేందుకు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. మార్కెట్‌కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, పార్టీ చర్ల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సోయం రాజారావు, శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులతో సమీక్ష

భద్రాచలంఅర్బన్: 2వేల నోటు ఉపసంహరణ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యలపై మంగళవారం భద్రాచలం పట్టణంలోని సుమారు 14 బ్యాంక్ బ్రాంచ్ అధికారులతో ఏఎస్పీ పారితోస్ పంకజ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంకుకు వచ్చే కస్టమర్లుకు విధిగా తాగునీరు, బ్యాంకు ఎదుట టెంటు ఏర్పాటు చేయాలని సూచించారు. నోట్ల మార్పిడికి సంబంధించి బ్యాంకు అవలంబిస్తున్న విధివిధానాలు, ఆర్బీఐ మార్గదర్శకాలను ఫ్లెక్సీ రూపంలో బ్యాంకుల ఎదుట అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో భద్రాచలం టౌన్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు రెడ్డి, ఎస్సైలు శ్రీకాంత్, మధు ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

బూర్గంపాడు: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకుడు బి.తాతారావు సూచించారు. మోరంపల్లిబంజర రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలనే, కొనేటప్పుడు లేబుల్స్, క్యూఆర్ కోడ్‌లను పరిశీలించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏఓ శంకర్, సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, ఏఈఓలు నాగవైష్ణవి, లావణ్య, రవితేజరెడ్డి, రైతుబంధు సమితి కోఆర్డినేటర్లు కైపు సుబ్బరామిరెడ్డి, గాదె నర్సిరెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

వేడుకలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా జీఎం రాంచందర్

మణుగూరురూరల్: జూన్ 2వ తేదీన సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో పీవీకాలనీ భద్రాద్రి స్టేడియంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ కోరారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన ఏరియా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లను సుందరంగా అలంకరించాలన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో మహిళలు, యువతులకు రంగోళీ, టగ్ ఆఫ్ వార్, బాల్ ఇన్ బాస్కెట్ వంటి ఆటలపోటీలతో పాటు చిన్నారులకు రన్నింగ్ రేస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆవిర్భావం రోజున సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్తమ ఉద్యోగులకు సన్మానాలు, విజేతలకు బహుమతుల ప్రదానం నిర్వహించనున్నామన్నారు. అలాగే వేడుకల్లో సింగరేణి సేవా సభ్యులు, మహిళలతో తెలుగు రుచుల తినుబండారాల స్టాల్స్ ఏర్పాటు చేయించాలన్నారు. వేడుకలకు వచ్చే సింగరేణియులు, వారి కుటుంబ సభ్యులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏరియా ఎస్ఓటూ జీఎం డి.లలిత్‌కుమార్, ఏజీఎం కేపీయూజీ నాగేశ్వరరావు, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీపతిగౌడ్, డీజీఎంలు వెంకట్రావు, ఎస్.రమేష్, అనురాధ, డీవైసీఎంఓ మేరికుమార్, డీవైఎస్ఈలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం భూగర్భగనిలో చండీహోమం

సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగని ఆవరణలో అమ్మవారి ఆలయ ఆరో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం చండీహోమం, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఏరియా జీఎం దుర్గం రామచందర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై చండీహోమం, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గని ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు దంపతులు, మేనేజర్ వెంకటేశ్వర్లు దంపతులు, గని రక్షణ అధికారి మధుబాబు దంపతులు అమ్మవారికి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ చండీహోమం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం డి.లలిత్‌కుమార్, పీకేఓసీ పీఓ లక్ష్మీపతి గౌడ్, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ఏరియా రక్షణ అధికారి వెంకటరమణ, గని వెల్ఫేర్ అధికారి నరేష్, టిబిజికెఎస్ నాయకులు ప్రభాకర్‌రావు, ఆలయ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎల్ఐసీ ఏజెంట్ మృతి

అశ్వాపురం: ఏపీ రాష్ట్రం చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రంలోని చవిటిగూడెం గ్రామానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్, మాజీ వార్డు సభ్యుడు భూక్యా నాగేశ్వరరావు(44) మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాగేశ్వరరావు మృతికి డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, సర్పంచ్ బాణోత్ శారద, పలువురు సంతాపం తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణానికి చెందిన యువతి దుర్గాభవాని సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోగా, కుటుంబీకులు మంగళవారం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బంధువులు, యువతి స్నేహితుల వద్ద ఆరా తీసినా సమాచారం లేకపోవడంతో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

నాటు సారా స్వాధీనం

అశ్వారావుపేటరూరల్: నాటుసారాను తరలిస్తుండగా మంగళవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలలోని కొత్తూరు సమీపాన చెక్‌పోస్ట్ వద్ద రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు తనిఖీలు చేపట్టారు. మండలంలోని దురదపాడుకు చెందిన కురం జోగరావు, మరో వ్యక్తి కలిసి ఛత్తీస్‌గఢ్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా పరిశీలించారు. వారి వద్ద 23 లీటర్ల నాటు సారా లభ్యమైంది. దీంతో సారాను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగయ్య, ఎస్సై రాజేశ్వరరావు తెలిపారు.

బ్రోచర్లు ఆవిష్కరణ

దమ్మపేట: విజయ డెయిరీ బ్రోచర్‌ను స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. మండల పరిధిలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యే నివాసంలో డెయిరీ ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ కుమారస్వామి, తహసీల్దార్ స్వామి, పశువైద్యాధికారి మన్యం రమేష్ పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య సేవలు

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సీఎస్‌సీ హెల్త్‌కేర్ సెంటర్ వారి ఆధ్వర్యంలో మంగళవారం భవన నిర్మాణ రంగ కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కార్మికుల పేర్లు నమోదు చేసి వైద్యపరీక్షలు చేశారు. సర్పంచ్ బాడిశ సతీష్ మాట్లాడారు. సీఎస్‌సీ హెల్త్‌కేర్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎస్‌కె.అక్బర్ అలీ, క్యాంప్ కోఆర్డినేటర్ జి.మహేష్, పంచాయతీ కార్యదర్శి సునీత, గుమస్తా రమేష్, నర్సింహరావు, భాస్కర్, సీతారాములు పాల్గొన్నారు.

కంటివైద్య శిబిరం..

చంద్రుగొండ: మండలంలోని వెంకటియాతండాలో మంగళవారం స్సర్పంచ్ బాణోత్ బాలాజీ కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కనకం తనుజా, రఘునంద సాయిబాబు, వైద్య సిబ్బంది యండి.ఇమాం, నీలిమ, రేఖన, యండి.షబీన తస్నీన్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



అశ్వాపురం: తనిఖీలు చేస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఏఓ సాయిశంతన్‌కుమార్

అశ్వాపురం: మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను పోలీస్, వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మంగళవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్, రిజిస్టర్లు పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఎరువులు, విత్తనాలు కొనుగోళ్లు జరపాలని నాణ్యమైన విత్తనాలు రైతులకు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమాల్లో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు జితేందర్, సురేష్, వ్యవసాయ అధికారి సాయిశంతన్‌కుమార్, ఆర్ఐలు నాగమణి, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: రైతులకు నాణ్యమైన విత్తనాలనే అమ్మాలని, లేదంటే పీడీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారి ఛటర్జీ, కరకగూడెం ఎస్సై జీవన్ రాజ్‌లు ఫెర్టిలైజర్ దుకాణదారులను హెచ్చరించారు. ఈ మేరకు వారు మంగళవారం మండలంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. ఎవరైన నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీస్, వ్యవసాయ శాఖ సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

పినపాక: బయ్యారం గ్రామంలోని ఎరువుల దుకాణాల్లో సీఐ రాజగోపాల్, వ్యవసాయశాఖ అధికారుల తనిఖీలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. దుకాణాల్లోని పలు పత్రాలను పరిశీలించారు. దుకాణంలో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని, నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు రైతులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై నాగుల్ మీరా, ఏఈఓ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

‘భగీరథ’ సమస్యలు తీరేనా?

రెండు వారాలుగా దాహంతో గ్రామం

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన మనుబోతులగూడెం గ్రామానికి గత పదిహేను రోజులుగా మిషన్‌భగీరథ గోదావరి నీరు అందడం లేదు. ఈ పంచాయతీకి మిషన్‌భగీరథ ద్వారా ఎలకలగూడెంలో సంప్ నిర్మించి గోదావరి నీరు అందిస్తూ వస్తున్నారు. అయితే సంపు నుంచి గ్రామం ఎత్తులో ఉండటం పైపులైన్ల లీకేజీ కారణంగా గత పదిహేను రోజులుగా నీరు అందడం లేదు. ఈ విషయంపై మిషన్‌భగీరథ ఏఈ ప్రశాంత్‌ను వివరణ కోరగా.. రెండు రోజుల కొకసారి నీరు సరఫరా చేస్తున్నామని, రహదారి పనులతో తరచూ పైపులు లీకవుతున్నాయని తెలిపారు. మిషన్‌భగీరథ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరించాలని మనుబోతులగూడెం గ్రామస్తులు కోరుతున్నారు.

దుర్వాసనతో భగీరథ నీరు..

దమ్మపేట: మిషన్ భగీరథ నీరు మాకొద్దు అని దమ్మపేట గ్రామ పరిధిలోని మల్లారం కాలనీకు చెందిన మహిళలు మంగళవారం నిరసన వ్యక్తం చేసి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యను వివరిస్తూ.. గత రెండు నెలల నుంచి మిషన్ భగీరథ నీరు దుర్వాసన వస్తోందని, ఆ నీటి మూలంగా చర్మ వ్యాధులు, అంటు వ్యాధుల బారిన పడుతున్నామని తెలిపారు. భగీరథ నీటికి బదులుగా పంచాయతీ బోర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని మహిళలు కోరగా.. కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జాన్‌బీ, నక్కా నాగమణి, రాధిక, నల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీడీలు సకాలంలో చెల్లించండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి సబిత

అన్నపురెడ్డిపల్లి: రెండో విడత గొర్రెల పంపిణీకి అర్హులైన లబ్ధిదారులు, డీడీలను సకాలంలో చెల్లించాలని జిల్లా సంక్షేమ అధికారిణి, గొర్రెల యూనిట్ల పంపిణీ మండల ప్రత్యేక అధికారిణి సబిత సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మర్రిగూడెం పంచాయతీలో పర్యటించిన ఆమె.. గొర్రెల పెంపకందారులతో మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈసీ హసీనా, సూపర్‌వైజర్ గంగాజలం తదితరులు పాల్గొన్నారు.

పాల్‌రాజ్‌కు ఘన నివాళి

భద్రాచలంటౌన్: పట్టణంలో సెయింట్ పాల్స్ లూథరన్ పాఠశాల ఆవరణలో మంగళవారం మాజీ దివంగత ఎమ్మెల్యే డాక్టర్ పాల్‌రాజ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన 12 వర్ధంతిని పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కరించడంలో పాల్‌రాజ్ కృషిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో రాధ మనోజరి, తిమోత్, ఆశీర్వాదం, పున్నయ్య, జోసఫ్, రమేష్, సుధాకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సమావేశం

కరకగూడెం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రేగా కాళిక అధ్యక్షతన పంచాయతీ సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులతో సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ కాళిక మాట్లాడుతూ.. మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ చొరవతో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆధ్వర్యంలో నిధులను మంజూరు అయినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ, ఎంపీఓ పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జలగం పర్యటన

అశ్వారావుపేటరూరల్: మాజీ మంత్రి జలగం ప్రసాద్ మంగళవారం అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం, గుమ్మడవల్లి గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. వినాయకపురం గ్రామంలో తన వర్గీయులను కలిసి కొద్ది సేపు ముచ్చటించారు. అనంతరం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్ట్ కింద నిర్మిస్తున్న శ్రీ గంగానమ్మ ఆలయ నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు కలిసి త్వరలో జరిగే ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందించారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

చర్ల: ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చర్లలోని సుబ్బయ్యకుంటలో కొనసాగుతున్న ఉపాధ పనుల ప్రాంతాన్ని సందర్శించిన ఆయన.. అక్కడ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. కూలీలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మచ్చా మాట్లాడుతూ.. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలి ధర రూ.600కు పెంచాలని, పని దినాలను ప్రతీ కుటుంబానికి 200 రోజులుగా తీర్మానించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న హైదరాబాద్‌లో జరిగే ఆందోళనలకు ఉపాధి కూలీలంతా హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మచ్చా రామారావు, శ్యామల వెంకట్, నర్సింహామూర్తి పాల్గొన్నారు.

కుట్టుమిషన్ వితరణ

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో ఐటీసీలో కాంట్రాక్ట్ కార్మికుడు, గాంధీనగర్ వాసి శ్రీనివాస్ కుటుంబానికి మంగళవారం కుట్టుమిషన్ వితరణగా అందజేశారు. శ్రీనివాస్ కుటుంబ ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో క్లబ్ అధ్యక్షుడు టి.సూర్యభాస్కర్‌రావు నేతృత్వంలో కుట్టుమిషన్ అందించి బాసటగా నిలిచారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టర్ విజయ్‌కుమార్, శ్యామ్‌కిరణ్, ఉషారాణి, చెంగలరావు, మరదాన శ్రీనివాస్, సాయిరామ్, శ్రీరామ్‌రెడ్డి, ఖాదర్ వలీ, దినేష్, అంజిరెడ్డి, శివ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పలు ప్రాంతాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం పాలాభిషేకం చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు విధి విధానాలను రూపొందించాల్సిందిగా ఉన్నతాధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించడంతో.. ప్రజాప్రతినిధులతో కలసి ఆయన చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు



దమ్మపేటలో..



అశ్వారావుపేటరూరల్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..